


## నుమాయిష్‌లో హెల్త్ సెంటర్

నాంపల్లి ఎగ్జిబిషన్‌లో మంగళవారం హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నరసింహ, చిత్రంలో ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు వనం సత్యేందర్, కార్యదర్శి హనుమంతరావు తదితరులు.

- అబిడ్స్, జనవరి 23


# నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

13 | హైదరాబాద్, బుధవారం 24 జనవరి 2024 | HYDERABAD


## 37 ఏండ్లుగా మార్నింగ్ వాక్

మార్నింగ్ వాక్ కార్యక్రమం చేపట్టి 37వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా మంగళవారం మన్సూరాబాద్ డివిజన్ హకీమాబాద్‌లో సూర్యునికంటే ముందు సుధీరన్న బ్యానర్‌తో మార్నింగ్ వాక్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

- ఎల్బీనగర్, జనవరి 23









# టార్గెట్ 259 కోట్లు వసూలు 22 కోట్లే

**ఆస్తి పన్ను వసూళ్లలో అధికారుల నిర్లక్ష్యం**

**క్షేత్రస్థాయిలో పర్యటించని జోనల్ కమిషనర్లు**

**పని తీరు మార్చుకోవాలని దానకిశోర్ హెచ్చరికలు**

**లక్ష్యాలను చేరకపోతే జోనల్ కమిషనర్లపై కఠిన చర్యలు**

సిటీబ్యూరో, జనవరి 23 (నమస్తే తెలంగాణ ) : ఆస్తి పన్ను వసూళ్లలో ఉన్నతాధికారుల నిర్లక్ష్యంపై పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్దేశిత లక్ష్యానికి చేస్తున్న వసూలుకు పొంతన ఉండడం లేదని, జోనల్ కమిషనర్లు ఏం చేస్తున్నారని మండిపడ్డారు. క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయాలని, పని తీరు మార్చుకుని లక్ష్యాలను చేరకపోతే కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా దానకిశోర్ హెచ్చరికలు జారీ చేశారు. ఈ నెలలో ఆరు జోన్ల నుంచి రూ.259.25 కోట్ల టార్గెట్‌లో ఇప్పటి వరకు రూ. 22.43 కోట్లు మాత్రమే వసూలు చేయడం ఏమిటని దానకిశోర్ ప్రశ్నించారు. వచ్చే రెండు నెలల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలోనే 60శాతానికి పైగా వసూళ్లు రాబట్టకపోవడంపై దానకిశోర్ ఉన్నతాధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.



# సైకిల్ ట్రాక్‌పై సోలార్ పవర్

*13 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి*



సిటీబ్యూరో, జనవరి 23 (నమస్తే తెలంగాణ) : దేశంలోనే మొట్టమొదటిసారిగా హైదరాబాద్ మహానగరానికి మణిహారంలా ఉన్న ఔటర్ రింగు రోడ్డు వెంబడి సోలార్ రూఫ్ టాప్ సైకిల్ ట్రాక్ ప్రాజెక్టును కేసీఆర్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ఐటీ కారిడార్‌లోని నానక్‌రాంగూడ ఇంటర్‌చేంజ్ నుంచి నార్సింగి మీదుగా తెలంగాణ పోలీస్ అకాడమీ వరకు ఒక మార్గం, నార్సింగి నుంచి కోకాపేట, కొల్లూరు మీదుగా ఈదుల నాగులపల్లి వరకు మరో మార్గంలో సైకిల్ ట్రాక్‌ను నిర్మించారు. రెండు మార్గాల్లో కలిసి మొత్తం 23 కి.మీ. మేర సైకిల్ ట్రాక్‌ను నిర్మించారు. సైకిల్ ట్రాక్‌పై నిర్మించిన రూఫ్‌పై ట్రాన్స్‌కో, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్‌పీడీసీఎల్)ల నుంచి 16 మెగావాట్ల డీసీ విద్యుత్ ఉత్పత్తికి అనుమతి పొందామని, సుమారు 13 మెగావాట్ల ఏసీ సోలార్ విద్యుత్ వినియోగంలోకి వచ్చేలా ఈ ప్రాజెక్టును డిజైన్ చేశామని అధికారులు తెలిపారు. డిజైన్‌కు అనుగుణంగానే క్షేత్రస్థాయిలో ఓఆర్ఆర్ వెంబడి సోలార్‌రూఫ్ టాప్ సైకిల్ ట్రాక్ పనులు చేపట్టారు. సోలార్ ప్యానల్స్ నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్‌కు 6 చోట్ల సబ్‌స్టేషన్లు, మరో 72 వరకు ట్రాన్స్‌ఫార్మర్లకు అనుసంధానం చేయడం ద్వారా పవర్ గ్రిడ్‌కు సోలార్ విద్యుత్ వెళ్లేలా నిర్మాణాలు పూర్తి చేసింది. దానికి అనుగుణంగా 14-15 కి.మీ పరిధిలోనే సోలార్ ప్యానల్స్‌ను కాంట్రాక్టు సంస్థ ఏర్పాటు చేసింది. ప్రాజెక్టులో భాగంగా నిర్ణయించిన 13 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని అధికారులు తెలిపారు. ప్యానల్స్ ఏర్పాటులో ఎలాంటి అవకతవకలు లేవని, చోరీ జరుగుతున్నట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదని అధికారులు తెలిపారు.

### 26న రిపబ్లిక్ సైక్లింగ్ రైడ్

సిటీబ్యూరో, జనవరి 23 (నమస్తే తెలంగాణ) : గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 26న హైదరాబాద్ సైక్లిస్టు గ్రూప్ ( హెచ్‌సీజీ ) ఆధ్వర్యంలో 'దేశభక్తి చాటుదాం. సైక్లింగ్ ప్రోత్సహిద్దాం' అనే థీమ్‌తో సైక్లింగ్ రైడ్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ఆ సంస్థ ఫౌండర్ నందనూరి రవీందర్ గౌడ్ మంగళవారం తెలిపారు. సోలార్ రూఫ్ సైక్లింగ్ ట్రాక్ వద్ద ఈ రైడ్ ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమవుతుందని వివరించారు. సైక్లింగ్ రైడ్‌లో పాల్గొనే వారు 9885440308 నెంబర్‌ను సంప్రదించాలని చెప్పారు.




పగ్స్ జాతి శునకాలకు తలెత్తే శ్వాసకోశ సమస్యలపై అవగాహన కలిగించేందుకు ఆక్సిజన్ సిలిండర్లతో శ్వాస తీసుకుంటూ ప్రదర్శన నిర్వహిస్తున్న పెటా సభ్యులు

# విదేశీ పగ్స్ వద్దు దేశీ పెట్స్ ముద్దు

*ధర్నాచౌక్‌లో అవగాహన కల్పించిన పెటా..*



సికింద్రాబాద్‌లో పగ్ జాతి శునకానికి గౌను వేసి స్కూటీపై తీసుకెళ్తున్న యువతి

కవాడిగూడ, జనవరి 22: వొడాఫోన్ ప్రకటనల ద్వారా అత్యంత ప్రాచుర్యం పొందిన విదేశీ జాతి పగ్స్ కుక్కలు నగర వాతావరణంలో ఇమడలేక శ్వాస కోశ సమస్యలతో బాధ పడుతున్నాయని పీపుల్స్ ఫర్ ఎథికల్ ట్రీట్‌మెంట్ ఆఫ్ యానిమల్ (పెటా) ఇండియా ఆవేదన వ్యక్తం చేసింది. మంగళవారం ఇందిరాపార్కు వద్ద ధర్నాచౌక్‌లో పెటా సమన్వయ కర్త ఉత్కర్ష్ గార్గ్ మాట్లాడుతూ.. పగ్స్ వంటి విదేశీ బ్రాచైసెఫాలిక్ శునకాల(పొట్టి పుర్రె, చదునైన ముఖం ఉన్నవి)తో పాటు ఫ్రెంచ్, ఇంగ్లిష్ బుల్ డాగ్స్, పెకింగీస్, బోస్టన్ టెర్రియర్స్, బాక్సర్స్, కావాలియర్ కింగ్ చార్లెస్ స్పానియెల్స్, షిహ్ ట్జుస్ జాతులు బ్రాచైసెపలిక్ సిండ్రోమ్ వంటి ప్రాణాంతక రోగాలు సులువుగా వచ్చే ప్రమాదముందని హెచ్చరించారు. ఏదైనా ఆరోగ్య సమస్య తలెత్తగానే ఉన్నట్టుండి ఉక్కిరి బిక్కిరి అవడం, గురక రావడం, శబ్దం చేసి శ్వాస తీసుకోవడం వంటి సమస్యలతో సతమతమవుతాయని చెప్పారు. భిన్న ముఖ ఆకృతి కలిగిన ఇటువంటి శునకాలకు సరైన శ్వాస అందకపోవడంతో వాటి జీవితకాలం కూడా తగ్గిపోయి ఆరోగ్య సమస్యలను కలిగిస్తుందని పేర్కొన్నారు. చాలా రకాల విదేశీ జాతి కుక్కలకు ఇక్కడి వాతావరణం సరిపడదని వాటిని పెంచడమంటే ఆ శునకాలను ఇబ్బంది పెట్టడమేనని అభిప్రాయపడ్డారు. అందువల్ల మన వాతావరణంలో ఇమడగలిగిన దేశీయ కుక్కలనే పెంచుకోవాలని, దత్తత తీసుకోవాలని విన్నవించారు. ఈ సందర్భంగా పెటా సభ్యులు.. పగ్స్ దుస్తులు ధరించి ఆక్సిజన్ సిలిండర్లతో శ్వాస తీసుకుంటూ ఆ జాతి శునకాల ఆరోగ్య పరిస్థితిని కళ్లకు కట్టినట్టు వివరించారు.




కొట్టి వేయడానికి సిద్ధంగా ఉన్న బయో పార్క్

# జీవవైవిధ్యమా? విధ్వంసమా?

- వ్యవసాయ వర్సిటీ భూములను లాక్కోవద్దు
- జీవో 55కు వ్యతిరేకంగా విద్యార్థుల నిరసనలు

వ్యవసాయ యూనివర్సిటీ , జనవరి 23 : ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ ఉద్యాన యూనివర్సిటీ... ఈ రెండు వ్యవసాయానికి రెండు కండ్లు. ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం తరువాత సాగు కొత్త పుంతలు తొక్కడం కీలక భూమిక పోషించాయి. 2014 నుంచి దాదాపు 67 కొత్త వంగడాలను సృష్టించింది. వర్సిటీలో గల 400 రకాల వృక్షజాతులు, 80 రకాల పక్షులు, 350 అరుదైన జాతులతో జీవ వైవిధ్యం విరాజిల్లుతున్నది. దక్కన్ పీఠభూమిలో ఉన్న వైవిధ్యమైన వాతావరణంలో ఉన్న బయోడైవర్సిటీ పార్కును ధ్వంసం చేసేలా, రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లో ఉన్న ఈ రెండు యూనివర్సిటీల పరిధిలోని దాదాపు 100 ఎకరాల భూమిని హైకోర్టు నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించింది. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే తీసుకొచ్చిన జీవో నెం.55పై విద్యార్థిలోకం భగ్గుమన్నది. యూనివర్సిటీ భూములు కాపాడేందుకు రోజుకో తీరున నిరసన తెలుపుతున్నారు. సేవ్ ద యూనివర్సిటీ ల్యాండ్స్, సేవ్ ఫార్మర్స్, స్టూడెంట్ పవర్.. నేషనల్ పవర్ అంటూ సంక్రాంతి సెలవులనూ లెక్కచేయకుండా విద్యార్థులు చేపట్టిన ధర్నాలకు అఖిల పక్ష నాయకులు మద్దతు ప్రకటించారు. రాజేంద్రనగర్‌తో పాటు నాగర్ కర్నూల్ జిల్లా పాలెం, సిరిసిల్ల, వరంగల్ ,ఆదిలాబాద్, వర్సిటీ బ్రాంచ్‌లలోనూ రోజూ ఉద్యమాలు కొనసాగుతున్నాయి. వర్సిటీ కళాశాల విద్యార్థి సంఘాల నాయకులు రాజ్ కుమార్, శ్రీజ, అరవింద్, మధుకర్, సత్యమూర్తి, సురేందర్,దీక్షిత్, భానుచందర్, హరిప్రియ, శిరీష, అరవింద్, వంశీచందర్‌రెడ్డి, వినయ్ రెడ్డి, శంకర్ నాయక్, రాకేష్, ఆధ్వర్యంలో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారు.




నిరసన తెలుపుతున్న విద్యార్థులు



## ఢిల్లీ గణతంత్ర వేడుకలకు హెచ్‌పీఎస్ విద్యార్థిని

అమీర్‌పేట్, జనవరి 23 : ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలకు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని సనత్‌నగర్‌కు చెందిన ఆకర్షణ సతీశ్‌కు ఆహ్వానం అందింది. తాను సేకరించిన పుస్తకాల ద్వారా చక్కటి గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తున్న హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థిని ఆకర్షణను ప్రధాని మోదీ ఇటీవల 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ నేపథ్యంలోనే రక్షణ శాఖ నుంచి ఆకర్షణకు ప్రత్యేక ఆహ్వానం అందింది. ఇలా ప్రత్యేక ఆహ్వానం అందుకున్న వారు కర్తవ్యపథ్ నుంచి వేడుకలను ప్రత్యక్షంగా తిలకిస్తారు. గణతంత్ర వేడుకలకు ఢిల్లీ నుంచి ఆహ్వానం అందడంపై ఆకర్షణ సతీశ్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## నానక్‌రాంగూడకు ఎంఆర్‌డీసీ ఆఫీస్



సిటీబ్యూరో, జనవరి 23 (నమస్తే తెలంగాణ) : మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీ) కార్యాలయాన్ని నానక్‌రాంగూడకు తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం తార్నాకలోని హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) కార్యాలయంలో కొనసాగుతున్న కార్యాలయాన్ని పరిపాలనా సౌలభ్యం కోసం మార్చాలని నిర్ణయించారు. ఈ మేరకు మంగళవారం మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, హెచ్‌ఎండీఏ జోనల్ కమిషనర్ ఆమ్రపాలి నానక్‌రాంగూడలోని హెచ్‌జీసీఎల్ (హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్)లోని కార్యాలయంలోని పలు చాంబర్లను, ఆఫీస్ స్పేస్‌ను పరిశీలించారు. హెచ్‌జీసీఎల్ కార్యాలయంలోని అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై ఎంఆర్‌డీసీ కార్యాలయం ఏర్పాటుపపై చర్చించారు. ఇక్కడి రెండు భవనాల్లో ఉన్న ఖాళీ స్థలాల్లో కార్యాలయం ఏర్పాటుకు అవసరమైన ఫర్నిచర్‌ను సమకూర్చి, ఉన్నతాధికారులకు అవసరమైన చాంబర్లను ఏర్పాటు చేయాలని సూచించారు.

# నమ్మించి.. కుచ్చుటోపీ

**పార్ట్‌టైమ్ జాబ్, ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో భారీ మోసాలు**

**శిక్షణ పేరుతో పెట్టుబడుల ఆకర్షణ..**

- రోజూ రూ. 3 కోట్ల సైబర్ దోపిడీ
- సాఫ్ట్‌వేర్ కన్సల్టెంట్‌కు రూ. 2.3 కోట్లు టోకరా
- ఏడాదిలో బాధితుడితో 638 సార్లు లావాదేవీలు

సిటీబ్యూరో, జనవరి 23 (నమస్తే తెలంగాణ) : సైబర్‌నేరగాళ్లు పార్ట్‌టైమ్ జాబ్, ఇన్వెస్ట్‌మెంట్ పేర్లతో భారీ మోసాలకు పాల్పడుతున్నారు. ఇటీవల ఫేస్‌బుక్‌లో నగరానికి చెందిన వ్యాపారికి ట్రేడింగ్ శిక్షణ పేరుతో రూ. 55 లక్షలు దోచేశారు. ఈ ఘటన మరవక ముందే రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఒక సాఫ్ట్‌వేర్ సంస్థ ప్రిన్సిపల్ కన్సల్టెంట్‌కు రూ. 2.28 కోట్లు టోకరా వేశారు. సుమారు సంవత్సరం పాటు సైబర్‌నేరగాళ్లతో బాధితుడు టచ్‌లో ఉంటూ 638 సార్లు బ్యాంకు ఖాతాలకు డబ్బు లావాదేవీలు నిర్వహించాడు. ఇలా ప్రతి రోజూ సైబర్ నేరగాళ్లు రూ. 3 కోట్ల వరకు సైబర్ దోపిడీ చేస్తున్నారు.

- మీర్‌పేట్ ప్రశాంతి హిల్స్‌లోని బాధితుడు ఒక మల్టీనేషనల్ కంపెనీకి ప్రిన్సిపల్ కన్సల్టెంట్‌గా కొనసాగుతున్నాడు. 2023, ఫిబ్రవరిలో అంతర్జాతీయ నెంబర్‌తో వచ్చిన కాల్స్‌కు స్పందించలేదు. మీరు ఇన్వెస్ట్ చేస్తే మంచి డబ్బు లు వస్తాయని మెసేజ్‌లు పెట్టారు. ఆ తరువాత వాట్సప్‌కు ఎక్స్‌పర్ట్‌మార్కెట్‌ట్రేడ్ 247.కామ్, ఎక్స్‌పర్ట్‌మార్కెట్ఇన్వెస్ట్289.కామ్ వెబ్‌సైట్లను పంపించి అందులో డ్యాష్‌బోర్డును పరిశీలించాలని సూచించారు. దీంతో బాధితుడు వాళ్ల మాటలు నమ్మి రూ. 5 వేలు, రూ. 20 వేలు పెట్టుబడి పెట్టడంతో వాటికి లాభాలు ఇచ్చారు. ఇలా సైబర్ నేరగాళ్లు చెప్పే మాటలు వింటూ 638 సార్లు ఆయా బ్యాంకు ఖాతాల నుంచి రూ. 2.28 కోట్లు సైబర్‌నేరగాళ్లు దోచేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏసీపీ వెంకట్ రెడ్డి నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ రవిబాబు కేసు దర్యాప్తు చేపట్టారు.
- నల్లకుంటకు చెందిన ప్రైవేట్ ఉద్యోగికి టెలిగ్రామ్‌లో పార్ట్‌టైమ్ జాబ్ ఉందని సిమిలర్‌వెబ్‌సేల్స్-ఇంటలిజెన్స్.కామ్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. దీంతో బాధితుడు రిజిస్ట్రేషన్ చేసుకోగా ఒక రౌండ్‌లో 35 ప్రొడక్ట్స్ ఉంటాయని వాటికి రివ్యూ రాస్తే 0.75 శాతం కమిషన్ వస్తుందని నమ్మించారు. దీనికి బాధితుడు మొదట రూ. 10 వేలు పెట్టుబడి పెట్టగా రూ. 46600 వచ్చాయి. ఇలా దఫ దఫాలుగా రూ. 25 లక్షలు పెట్టుబడి పెట్టి మోసపోయాడు. దీనిపై హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.
- బిటెక్ పూర్తి చేసి ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న యువతికి పార్ట్‌టైమ్ జాబ్ రోజు రూ. 5 వేలు సంపాదించవచ్చని మెసేజ్ వచ్చింది. దానిని చూసిన ఆమె టెలిగ్రామ్ గ్రూప్‌లో చేరింది. ప్రతి రోజు 25 టాస్క్‌లు ఇస్తామని కొన్ని వెబ్‌సైట్ లింక్‌లు పంపించారు. వాటిని క్లిక్ చేయడంతో మీ టాస్క్ పూర్తియ్యిందని రూ. 300 పంపించారు. దీంతో ఆమెకు నమ్మకం కలుగడంతో ప్రీ పెయిడ్ టాస్క్‌ల పేరుతో ఐదు వేలు పెట్టుబడి పెడితే 30 శాతం లాభం కలిపి పంపించారు. ఆమెకు నమ్మకం కుదిరాక దఫ దఫాలుగా రూ. 20 లక్షలు పెట్టుబడి పేరుతో కాజేశారు. బాధితురాలు సైబరాబాద్ సైబర్‌క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేపట్టారు.



## పచ్చని ప్రయాణం

ఇరువైపులా మొక్కలు, రంగు రంగుల పూలతో ఆహ్లాదకరంగా కనిపిస్తున్న నెక్లెస్ రోడ్‌లోని సంజీవయ్య పార్కుకు వెళ్లే రహదారి